# కందుక క్రీడ

రచయిత :

## శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

హస్తినాపురానికి వుత్తరాన పెద్ద బయలు, నడుమ అగాధమైన పెద్ద నుయ్యి.

బయటి అంచుల ఎన్నో రథాలూ, గుర్రాలూ వున్నవి. సారథులూ, పరిజనులూ గుసగుస లాడుకుంటూ నూతికేసి చూస్తూ వున్నారు.

సుయోధనుడూ, దుశ్శాసనుడూ మొదలైన కౌరవులూ, కర్ణుడూ, పంచపాండవులూ, అందరి మిత్రులూ, అనుచరులూ, కొద్దిపాటి పరిజనులూ నూతి చుట్టూ మూగి వున్నారు. వారందరూ బంతి ఆడుకోడానికి అక్కడికి వచ్చి, సగం ఆటలో బంతి నూతిలో పడిపోగా ఆడుకోడానికి వీలులేక, ఆబంతి వచ్చే వుపాయం తోచకా, యెలాగేనా తీసి ఆబంతితోటే ఆడుకోవాలనే పట్టుదలతోటి నూతిలోకి తొంగి చూస్తూ, వుపాయాలు వెతుక్కుంటూ, లాభం లేదని నిరుత్సాహపడుతూ— తీవ్రంగా ఆలోచిస్తూ వున్నారు.

అర్జునుడు అందరికంటే యెక్కువ దీక్షతో ఆలోచిస్తూ వున్నాడు. "ఏమేనా తోచిందా?" అన్నట్టు ధర్మరాజు, అర్జునుడికేసి మాటిమాటికీ చూస్తూవున్నాడు.

అది మధ్యాహ్నం, బాగా చల్లబడ్డ సమయం.

భీమసేనుడు :

బంతి మునిగిపోలేదు. ఇంకా తేలేవుంది.

ధర్మరాజు :

"అలా తెలివితక్కువగా మాట్టాడకు" అన్నట్టు భీముడికేసి రూక్షంగా చూస్తాడు.

దుశ్శాసనుడు :

ఎవరదీ? భీమసేనుడా? అవునోయ్! నువ్వన్నట్టది తేలే వుంది. ఎప్పుడూ తేలే వుంటుంది కూడానూ. దాని కడు పెప్పుడూ డొల్లగా వుంటుంది కనక మునిగిపోదు. అదెప్పుడూ బానలకొద్దీ పప్పు ఫప్పళాలు కొట్టదు కాదూ మరీ?

(కౌరవులూ, వారి పక్షంవారూ చిరునవ్వు నవ్వుతారు. సుయోధనుడూ కర్ణుడూ వారిని చూపులతో వారిస్తారు)

భీమసేనుడు :

(పెంకి ంగా) ఆమాత్రం తెలుసులేవోయ్!

అర్జునుడు :

(భీముడికేసి 'మాట్లాడకు' అన్నట్టు చూస్తాడు)

ధర్మరాజు :

చూస్తూ యిలాగ నుంచోడమేనా అది పైకివచ్చే వుపాయం యేమేనా వున్నదా ?

భీమసేనుడు :

ఒక్కటే వుపాయం. దేవతలు దిగి వచ్చినా అది యిక పైకి రాదు. మరో బంతితో సరదాగా ఆడుకుంటే వుంది; గాని, యిలాగ దిక్కులు చూస్తూ యెంతసేపు నుంచున్నా లాభం లేదు.

(దూరాన సకుటుంబపరివారంగా ద్రోణుడు.)

సుయోధనుడు :

(ఉపాయం తోచక అలాగా యిలాగా చూస్తూ, హఠాత్తుగా వుత్తరంగా చూసి చకితుడై) కర్ణా! ఎవరా వర్చస్వి ?

(అందరూ తేరిపారజూస్తారు.)

కర్ణుడు :

బ్రహ్మవర్చస్సూ, క్షత్రియతేజస్సూ మిళితం అయి రూపొందినట్టున్నది ఆమూర్తి. ఆదీర్ఘకోదండం పినాకాన్ని తోపిస్తూ వున్నది. ఉండు వుండు. మన యుయుత్సుడు వెళ్ళి, శిష్యులతో మాట్లాడి సంగతంతా తెలుసుకు వస్తున్నాడు.

సుయోధనుడు:

ఇంతటి వర్చస్వి నిదివర కెప్పుడూ చూడలేదు. వారి రాక మన నగరానికే అయితే మనం తరించిపోతాము.

కర్ణుడు :

నీకా సందేహం అక్కరలేదు. ఏమంటే? ఇటు వచ్చిన విద్యావంతుడు హేమాహేమీల పుట్టఅయిన యీ సామ్రాజ్యపీఠం విడిచిపోయి, మారుమూల, యే పల్లెటూళ్లోనో అణగారివుంటాడా? కాక: ఇక్కడ వుండవలసిందని మనం వారిని ప్రార్థించి కూడా నిలిపివెయ్యవచ్చు కాదూ?

సుయోధనుడు:

నీవుద్దేశం బాగున్నది.

(అప్పుడు యుయుత్సుడు వస్తాడు.)

యుయుత్సుడు:

(దుర్యోధనుడితో మెల్లిగా) వారు ద్రోణాచార్యులవారు. ఆమె మన కృపాచార్యులవారి తోడబుట్టువు కృపీదేవమ్మవారు, ద్రోణాచార్యులవారి ధర్మపత్ని. ఆబాలుడు వారి చిరంజీవి అశ్వత్థామ.తక్కిన వారు శిష్యులు.

సుయోధనుడు:

(కర్ణుడితో) వెదకబోయిన తీగ కాళ్ళకే తగుల్కొన్నది. కర్ణా! ధన్యులం. ఇవాళ మంచి సుదినం. ఇలాంటి దివ్యదర్శనం మనం యిదివర కెరగం. (అందర్నీ వుద్దేశించి) ఆవచ్చేవారు ద్రోణాచార్యులగారూ, వారి కుటుంబమూ శిష్యులూనూ. పాదాభివందనం చేసి సేవించుకుందాం అందరూ రండి.

(అందరూ బయలుదేరతారు. అప్పుడు ద్రోణుడూ, కృపీ, అశ్వత్థామా, శిష్యులూ ప్రవేశిస్తారు.)

సుయోధనుడు:

(కాలిజోడు దూరంగా విడిచి, పాగా తీసి దుశ్శాసనుడి చేతి కిచ్చి, వుత్తరీయం నడుముకి చుట్టుకుని) మహానుభావా! కౌరవయువరాజు, సుయోధనుడు అభివాదం చేస్తున్నాడు. (ముందు ద్రోణుడికీ, తరవాత వరసగా కృపికీ, అశ్వత్థామకీ, శిష్యులకూ పాదాభివందనం చేస్తాడు.)

ద్రోణుడు:

స్వస్తి. నగరం బయటనే మాకు రాజదర్శనం. ఇది చాలా బాగున్నది.

సుయోధనుడు:

ఈబ్రహ్మణ్యులకు అందరూ నమస్కారాలు సమర్పించుకోండి.

(మొదట ధర్మరాజూ, తరవాత వరసగా దుశ్శాసనుడూ, భీముడూ, అర్జునుడూ, నకుల

సహదేవుళ్ళూ, కర్ణుడూ—అందరూ అలా చేస్తూ వుంటారు.)

సుయోధనుడు:

(వెళ్ళి అశ్వత్థామను కౌగిలించుకుని) బాబూ! తమకు కుశలమా? కంటకమార్గంలో ప్రయాణం చెయ్యడంవల్ల తమ సుకుమారపాదాలు కందిపోతాయి వొత్తుదునా?

అశ్వత్థామ:

ఎంత మాట సెల విప్పించారూ?......కాని ధర్మంగానే వున్నది. మే మింతవరకూ అనుశ్రుతమూ వింటూ, వూహించుకుంటూ వున్నది యిప్పుడు ప్రత్యక్ష మైనది. మహోదార మైన భరతవంశంలో యిలాంటి ఆదరబుద్ధి వుండడం ఆశ్చర్యకరం కాదు. ప్రభూ! తమ అనుగ్రహానికి చాలా సంతోషం. తమ కటాక్షంవల్ల నాకీ ప్రయాణం చాలా వుల్లాసకరంగా వున్నది. అసాధారణ మైన తమ ఆదరణ నన్ను ఋణబద్ధుణ్ణి కూడా చేసింది.

సుయోధనుడు:

ధన్యుణ్ణి.

అశ్వత్థామ:

ఉభయత్రా అది సమానమే.

సుయోధనుడు:

తమకు ప్రత్యుత్తరం చెప్పలేను. (అశ్వత్థామను విడిచి ద్రోణుడి దగ్గిరికి వచ్చి) ఆచార్యోత్తమా! ఇతను మాతమ్ముడు దుశ్శాసనుడు. ఇతను మామిత్రుడు కర్ణుడు, తక్కిన వీ రందరూ మా తమ్ములే. వారు మా పాండురాజు దద్దయ్యగారి కుమాళ్లు. అందులోనూ వారు ధర్మనందనులు, ఆతను మారుతి భీమసేనుడు, అతను అర్జునుడు, అతను నకులుడూ, అతను సహదేవుడూనూ, తక్కినవారు మిత్రులు.

ద్రోణుడు:

చాలా సంతోషం, భరతవంశశరీరా లన్నీ యేక కాలంలో, యేకత్రా సాక్షాత్కరించడం—అందులోనూ ప్రథమదర్శనం, ఈసన్నివేశం చాలా బాగున్నది. అయితే, తమ రందరూ యిక్కడ యేమిచేస్తున్నారు ప్రభూ?

సుయోధనుడు:

మే మందరమూ బంతి ఆటకోసం యిక్కడికి వచ్చాము; కాని సగంలో అది నూతిలో పడిపోయింది. అది వచ్చే వుపాయం తోచక—(అర్థోక్తి)

ద్రోణుడు:

అందుకా నూతిలోకి చూస్తున్నారు?

సుయోధనుడు:

చిత్తం.

ద్రోణుడు:

ఉపాయం తోచే ధోరణి యెవరి కేనా కనపడుతోందా?

(ఎవరూ మాట్లాడరు)

సుయోధనుడు:

("ఏమంటా" వన్నట్టు కర్ణుడికేసి చూస్తాడు)

ధర్మరాజు:

(అర్జునుడి కేసి చూస్తాడు.)

అర్జునుడు:

(ఉపాయం తోచక చిరాకుపడుతూ మొగం వంచుకుంటాడు.)

కర్ణుడు:

నా కొకటి తోచింది; కాని—(అర్థోక్తి.)

సుయోధనుడు:

అదేదో ఆచార్యులవారికి నివేదించుకోవోయ్!

ద్రోణుడు:

అదేమిటో సెల విప్పించండి.

కర్ణుడు:

(మోడ్పుకేలితో) మహానుభావా! కులానికి నేను సూతుణ్ణి. తమకు విశదం కోసం మనవి చేసుకుంటున్నాను.

ద్రోణుడు:

నీవినయమూ, నిరాడంబరతా చాలా బాగున్నవి.

ఆ, జ్ఞాపకమున్నూ వచ్చింది. మా కృపాచార్యుడు నిన్ను గురించి చాలా దూరం చెబుతూ వచ్చాడు. అయితే, నీవచ్చున్న సూతకులప్రతీతికి అతీతంగా వున్నది. వర్ధమానులకుండవలసిన లక్షణాలు నీలో చాలా కనపడుతూవున్నవి. అంచేతనే యువరాజావారు నిన్ను తమ ప్రాణమిత్రులుగా భావించడమూ, పెద్దలున్నూ అంగీకరించడమూ జరిగివుంటుంది. కాక: ఇక్కడ వలప్రసక్తి యేమీలేదు. అయినా నీ సత్య నిరతి నన్ను ముగ్ధుణ్ణి చేసింది. ఆ వుపాయం యేమిటో చెప్పవోయ్ నాయనా!

కర్ణుడు:

ముందొక బాణంతో ఆబంతిని కొట్టడం. మరో బాణంతో ఆమొదటి బాణం పుంఖాన్ని—[అర్థోక్తి.)

అర్జునుడు:

నేను కొడతాను.

సుయోధనుడు:

(అర్జునుడికేసి తీవ్రంగా చూస్తాడు.)

ధర్మరాజు:

('అంత తొందరేం?' అన్నట్టు చూస్తాడు)

కర్ణుడు:

(నిరసనభావంతో) మరి చూడ్డం యెందుకూ?

అర్జునుడు:

ఇదిగో కొడుతున్నాను. (వెళ్లబోతాడు)

ధర్మరాజు:

(చెయ్యి పట్టుకుని అర్జునుణ్ణి ఆపి) ఆచార్యుల వారి సెలవు కాకుండా యేమిటా తొందర తమ్ముడూ?

అర్జునుడు:

(ఆగిపోయి తల వంచుకు నుంచుంటాడు)

ద్రోణుడు:

(అర్జునుణ్ణి నిర్దేశిస్తూ) వీ రెవరనీ సెల విప్పించారూ?

ధర్మరాజు:

మహాత్మా! ఇతను మాతమ్ముడు. అర్జునుడు.

ద్రోణుడు:

తమరా? జ్ఞాపకం వచ్చింది. తమ విషయమున్నూ కృపాచార్యుడు చాలా చాలా చెబుతూ వచ్చాడు. ప్రభూ! తమ వుత్సాహం బోధపడింది. చాలా సంతోషం. సూచన వినీవినడంతోటే అర్థం చేసుకున్నారు తమరు; కాని (కర్ణుణ్ణి చూపిస్తూ) యితని మాట పూర్తి కాలేదు. ఇతను చెయ్యవలసిన పని చెప్పాడు. సాధకబాధకాలు ఇక చెబుతాడు, తన విషయం కూడా చెప్పవలసి వుంది. ఇంతలో తమరు ఆసూచన స్వాయత్తం చేసుకోడానికి బయలుదేరడం బాగా లేదు. కనక, తమరు, యితని మాటలు వినపడనంత దూరంగా, వెళ్ళి వుండండి, ముందు తమరే ప్రయత్నం చేద్దురు గాని.

అర్జునుడు:

(మోడ్పుకేలితో) మహాప్రసాదం. (వెళ్ళిపోతాడు.)

ద్రోణుడు:

వారి కూడా యెవరూ వెళ్ళకూడదు. అక్కడ వారొక్కరే వుండాలి. (కర్ణుడితో) మరి కానియ్యవోయ్!

కర్ణుడు:

ఒక దాని పుంఖానికి మరో బాణం గుచ్చుకునేటట్టు, చివరి బాణం చేతి కందేదాకా—రెప్ప వేశాటప్పటికి కొట్టాలి. ఏమాత్రం వ్యవధానం యేర్పడినా, బాణా లన్నీ వొకదాని కొకటి దండగానే గుచ్చుకున్నా, అన్నీ బంతి దగ్గిరే గొలుసు కట్టుగా పడిపోతాయి.

ద్రోణుడు:

అవును. తరవాత?

కర్ణుడు:

చెయ్యవలసిం దిదీ. అయితే. నా కంతటి సత్తా లేదు. నేను కొట్టలేను.

ద్రోణుడు:

నీదగ్గిర పొల్లు మాటలు లేవు. స్వపరతారతమ్యం

నీకు బాగా తెలుసు. నువ్వు తప్పకుండా ముందుకు వస్తావు. సందేహం లేదు. యువరాజావారి విశ్వాసం యెంతమాత్రమూ అపాత్రన్యస్తం కాదు. (ఇతర్ల కేసి చూస్తూ) మరెవరి కేనా మరో వుపాయం తోచిందా ?

(ఎవరూ జవాబు చెప్పరు. అందరూ వొకరి మొగం వొకరు చూసుకుంటారు.)

ద్రోణుడు:

(అశ్వత్థామతో) నువ్వేమంటావు నాయనా ?

అశ్వత్థామ:

అంతకంటే మరి నాకున్నూ తోచలేదు నాయనగారూ! నాకున్నూ సత్తా చాలదండీ.

ద్రోణుడు:

సరే. (అందరి కేసీ చూస్తూ) నాకున్నూ మరో వుపాయం కనపడ్డం లేదు. లేదనిన్నీ చెప్పవచ్చు. అయితే: కర్ణుడు చెప్పినట్టు అసాధారణశరలాఘవం వుంటే గాని అది సాధ్యపడదు; కాని అర్జునులవారు కొడతామంటున్నారు.

అశ్వత్థామ:

అది చూడవలసిందే నండీ నాన్నగారూ !

ద్రోణుడు:

(కర్ణుడితో) ఏమంటావోయ్ ?

కర్ణుడు:

(మోదుప్కేలితో) నాకున్నూ చూడాలనే వున్నది.

ద్రోణుడు:

(సుయోధనుడితో) తమ సెలవు ?

సుయోధనుడు:

తమ చిత్తం; కాని (అందరికేసీచూసి) అందరూ చూడాలని వుబలాటపడుతున్నారు.

ద్రోణుడు:

చిత్తం. నేను వెళ్ళి దగ్గిర వుండి కొట్టించి చూస్తాను. తమ రందరూ యిక్కడే వుండండ. కనపడుతుందా యిక్కడికి ?

సుయోధనుడు:

చక్కగా కనపడుతుంది. తమరు దయచెయ్యండి.

ద్రోణుడు:

చిత్తం (వెళ్ళిపోతాడు)

అశ్వత్థామ:

(సుయోధనుడితో జనాంతికం) అర్జునులవారికిన్నీ మా కృపాచార్యులు మామయ్యగా రేనా ధనురాచార్యులు ?

సుయోధనుడు:

(అశ్వత్థామతో జనాంతికం) చిత్తం, మా కందరికిన్నీ వారే ఆచార్యులు.

అశ్వత్థామ:

(కొంచెం పెదవి విరిచి మళ్ళీ సుయోధనుడితో జనాంతికం) తమకి విలువిద్య అభిమానవిషయం కాదనుకుంటాను.

సుయోధనుడు:

(మళ్ళీ అశ్వత్థామతో జనాంతికం) తమరు సరిగా వూహించారు. గదావిద్య నాకు అభిమానం.

అశ్వత్థామ:

చిత్తం.

దుశ్శాసనుడు:

(కర్ణుడితో జనాంతికం) కొట్టగలడంటావా ?

కర్ణుడు:

(దుశ్శాసనుడితో జనాంతికం) చప్పట్లా?

దుశ్శాసనుడు:

(మళ్ళీ కర్ణుడితో జనాంతికం) అవి మాత్రం పైపైని వున్నాయా ?

కర్ణుడు:

(మళ్ళీ దుశ్శాసనుడితో జనాంతికం) ఎటయినా పైచెయ్యి మనదీ.

దుశ్శాసనుడు:

(మళ్ళీ కర్ణుడితో జనాంతికం) మనకి కావలసిం దదీ.

ధర్మరాజు:

(భీముడితో జనాంతికం) తమ్ముడు తొందర పడ్డాడు.

భీమసేనుడు:

(ధర్మరాజుతో జనాంతికం) తమ్ముడికి పరాభవం తప్పదు; కాని ధార్తరాష్ట్రుల్లో యెవరేనా నవ్వారంటే అందర్నీ పిండిపిండి కింద కొడతాను. ఏమంటా రన్నయ్యా ?

ధర్మరాజు:

(మళ్ళీ భీముడితో జనాంతికం) వద్దు వద్దు. మనకది మరీ పరాభవకారణం అవుతుంది. చల్ల-చల్లగా వూరుకో. (తర్జనితో బెదిరిస్తూ) నువ్విప్పుడు కిక్కురుమన్నావంటే బాగా జరగదు సుమా.

భీమసేనుడు:

చిత్తం.

(అందరూ నూతికేసి చూస్తారు. అందరి మొగాలమీదా ఆత్రం తొణికిసలాడుతూ వుంటుంది. కొంతసేపటికి పాండవులు తలలు వంచుకుంటారు. కౌరవులు కొంచెం వుత్సాహం కనపరుస్తారు; కాని తీవ్రంగా చూసి సుయోధనుడూ, కర్ణుడూ వారిని వారిస్తారు. తరవాత సుయోధనుడూ, కర్ణుడూ వొకరికేసి వొకరు గంభీరంగా చూసుకుంటారు. అప్పుడు ద్రోణుడు వస్తాడు, అందరూ అతనికేసి చూస్తారు.)

ద్రోణుడు:

అర్జునులవారి లక్ష్యవేధిత్వం ప్రశంసించతగ్గదే; కాని సాధన బొత్తిగా తక్కువ కావడంవల్ల సత్తా చాలింది కాదు. కొట్టలేకపోయారు. మరెవరేనా చూస్తారా ?

సుయోధనుడు:

మహాత్మా! విలువిద్య నాకు అభిమానవిషయం కాదు. (తన తమ్ములున్న వేపు కొకమాటు చూసి) మాతమ్ములున్నూ వుత్సాహపడుతూ వున్నట్టు లేదు. (ధర్మరాజు కేసి తిరిగి) తమరు—(అర్ధోక్తి.)

ధర్మరాజు:

[తల అడ్డంగా వూపుతాడు.]

సుయోధనుడు:

మరెవరూ చూసేవారు లేరు.

ద్రోణుడు:

[తల పంకిస్తూ] ఆశ్చర్యం. మరి యిక ఆబంతి ఆశ లేదన్నమాట.

సుయోధనుడు:

తమరలా సెల విప్పించవద్దు.

ద్రోణుడు:

మరేమేనా మార్గం వున్నదా ?

సుయోధనుడు:

ఉన్నది.

ద్రోణుడు:

సెల విప్పించండి.

సుయోధనుడు:

[మోడ్పుకేలితో] తమరు—[అర్ధోక్తి.]

ద్రోణుడు:

[కులాసాగా నవ్వేసి] బ్రాహ్మడు—శరలాఘవం—[సుయోధనుడి కేసి తిరిగి] ప్రభూ! పొట్టకోసం ధనుస్సు పట్టినవాణ్ణి నేను. [పెదవి విరిచి] ధైర్యం చాలదు.

సుయోధనుడు:

నా సాహసానికి మన్నించ కోరుతున్నాను. తమరు సెల విప్పించింది సత్యం—[నసుకుతాడు.]

ద్రోణుడు:

సత్యం కాదంటూరు తమరు. అంతేనా ప్రభూ ! నావిషయంలో తమ కలాంటి విశ్వాసం యేర్పడి

వుంటుంది. ఇందులో దుస్సాహసం యేమిన్నీ లేదు. మా కృపాచార్యుడు తమ కలాంటి నిశ్చయం కలిగించి వుంటాడు. అయితే, నిజానికి, నాకు, ధనుర్వేదం క్షుణ్ణంగానే తెలుసు. మెళకువలున్నూ బాగా అవగాహన అయి వున్నవి; కాని శరవిద్య అంటే చేతికి సంబంధించినది కాని బూకరింపు విద్య కాదు.

సుయోధనుడు:

కృపాచార్యులవారు మొట్టమొదట మాకు సెలవిచ్చింది తమరు నిరాడంబరు లనీ.

ద్రోణుడు:

సరే. అతను నాకు మంచి కవచం తొడిగాడన్నమాట. అతను అసత్యవాది అని తమకి తెలవడానికెంతో సేపు పట్టదు.

సుయోధనుడు:

వద్దు వద్దు. అది అలా కానివ్వవద్దని మా సవినయ ప్రార్థన. మరిన్నీ దయవుంచి- మాకీ- వినోదం అనుగ్రహించవలసిం దనిన్నీ మాకోరిక.

ద్రోణుడు:

ప్రయత్నించడానికీ, తమ ఆజ్ఞ తిరస్కరించడానికీ కూడా నాకు సాహసం కలగడం లేదు. అయినా తమ రింత పట్టు పట్టినప్పుడు—పరశురాములవారి వుపదేశం నన్నిప్పుడు గట్టెకించకపోతుందా? కాకపోయినా, బ్రాహ్మణ్యం నాకిప్పుడు పెట్టనికోటగా వుండనే వున్నది. ఏమంటే? దూషణభూషణ తిరస్కారాలు మాకు లెక్కలోవి కావు. అందలం యెక్కడమూ, మెయ్యడమూ—యివి మాకు సమానమే. పైగా ఇంత పెద్ద ధనుస్సు భుజానికి తగిలించుకు వచ్చి కాదంటే మాత్రం యేమి చెల్లుతుందీ? సరే మరీ. నేనూ ప్రయత్నం చేసి చూస్తాను. అందరూ దయచెయ్యండి.

(అందరూ నూతి దగ్గిరికి బయలుదేరతారు.)

ద్రోణుడు:

[సుయోధనుడితో] ఒక విధంగా యిది మంచికే వచ్చింది. ఏమంటారా? నేను పూనుకున్న కార్యం సిద్ధంపచెయ్యడానికేనా, భగ్నం చెయ్యడానికేనా యిది మంచి సన్నివేశం.

సుయోధనుడు:

జగదేకధానుష్కులకు భంగమా-మహాత్మా! అలాంటి సన్నివేశం కలిగించాలంటే యీశ్వరుడికేనా యెన్ని వేల గుండె లుండాలీ?

ద్రోణుడు:

అఘటనఘటనాసామర్థ్యం వినా యీశ్వరత్వం యేమిటి ప్రభూ?

సుయోధనుడు:

(మోడ్పుకేలితో)నా అవినయం క్షమించకోరుతున్నాను. ఆచార్యోత్తరూ! ఈశ్వరుడు వినా పరమాణువు కూడా లేదని దేశికోత్తముల వుపదేశం. తదంశ పరిపూర్ణంగా నిష్ఠితం అయితేనే మహాపురుషత్వం అనిన్నీ పెద్దల నిర్వచనం.

ద్రోణుడు:

అది సరే. అయితే, (తర్జనితో తనను నిర్దేశించుకుంటూ) ఇక్కడ వున్నది బ్రాహ్మణసామాన్యత మాత్రమే.

సుయోధనుడు:

అది అలా కాదని క్షణంలోనే వ్యక్తం కాబోతున్నది. (అగి)మనం నూతి దగ్గిరికి రానే వచ్చాము కూడానూ. (వెనక్కి తిరిగి "అక్కడే వుండండి అని అందరికీ సంజ్ఞచేసి ద్రోణుడితో) దయచెయ్యండి.

(ఇద్దరూ నూతి అంచుకి వెడతారు)

ద్రోణుడు:

(నూతిలోనికి చూస్తూ తర్జనితో నిర్దేశించి) బంతి అదీ అవునా ప్రభూ!

సుయోదనుడు:

చిత్తం.

ద్రోణుడు:

[ధనుస్సు చేతపుచ్చుకుని] అన్నట్టు మరిచిపోయాను. [మళ్లీ భుజానికి తగిలించుకుని గ్రీవాభంగాభిరామంగా చూస్తూ] ఎవరోయి విద్యార్థులూ?

ఒకశిష్యుడు:

(నమ్రుడై) గురుదేవా! మేము నేలంటు కూడా వదలనివాళ్లం.

ద్రోణుడు:

సరే. [ధనుస్సు చేతికి అందుకుంటూ సుయోధనుడితో] తమ ఆజ్ఞాబలం చూసుకుని సాహసిస్తున్నాను. [ధనుస్సు ఎక్కుపెట్టి టంకారం చేస్తాడు]

(అందరూ వులిక్కిపడతారు)

ద్రోణుడు:

[సుయోధనుడితో] సెలవా?

సుయోధనుడు:

[మోడ్పుకేలితో నమ్రుడవుతాడు]

ద్రోణుడు:

చిత్తగించండి. [అమ్ములపొది సరిగా సర్దుకుని, వొక బాణం చేతపుచ్చుకుని, నూతిలోనికి చూస్తూ సంధించి ఏకాగ్రతతో] శివోహం.

(నిమిషంలో బంతి పైని పడేస్తాడు. అందరూ కోలాహలం చేస్తారు)

అశ్వత్థామ:

[బాణం వూడతీసి తన వుత్తరీయంతో బంతితడి తుడిచి తండ్రికేసి చూస్తాడు]

ద్రోణుడు:

యువరాజావారికి సమర్పించుకోవోయ్ నాయనా!

అశ్వత్థామ:

చిత్తం. [బంతి దోసిట వుంచుకుని సుయోధనుడి యెదట నమ్రుడై నుంచుంటాడు]

సుయోధనుడు:

[ఆదరంతో ఆబంతి పుచ్చుకుని, అశ్వత్థామను వొకమాటు పొదివి పట్టుకుని, ద్రోణుడితో] చివరికి నాఅవినయమే ఫలించింది. ద్రోనిలి వొగ్గి నమ్రుడై మహాత్మా! ఇది మాకు అదృష్టపూర్వమే కాదు, అశ్రుతపూర్వమున్ను నన్ను పారవశ్యం చుట్టుకుంటూ వున్నది. మాట్లాడలేకుండా వున్నాను. [వంగి, బంతి కింద వుంచి, ద్రోనుడి పాదాలు అంటి, కళ్లకద్దుకుని, మళ్లీ బంతి పుచ్చుకుని, లేచి నుంచుని] ఈబంతి మాకు తమ వరప్రసాదం. దీన్ని మేము ప్రాణపదంగా చూసుకుంటూ వుంటాము.

ద్రోణుడు:

నా వొక్కమనవి.

సుయోధనుడు:

సెల విప్పించండి.

ద్రోణుడు:

ఇందరిలోనూ యీ వుపాయం కనిపెట్టగలిగినవాడు కుమారకర్ణుడు.

సుయోధనుడు:

మమ్మాటికీని. [కర్ణుణ్ణి దగ్గిరికి తీసుకుని కౌగిలించుకుని] ఇతను నాప్రాణమిత్రమైనందుకు పరమానందభరితుణ్ణవుతున్నాను.

ద్రోణుడు:

కనక ఆబంతి అతనికి—[అర్థోక్తి]

సుయోధనుడు:

తమరు ధర్మం సెల విప్పించారు. అభ్యుదయపరంపరాభివృద్ధిగా ఆశీర్వదిస్తూ, యిది, తమ దివ్యహస్తాలతో అతనికి-ప్రసాదించండి. [బంతి దోసిట వుంచుకుని అందిస్తాడు]

ద్రోణుడు:

తమ సెలవు. [బంతి పుచ్చుకుని] కర్ణా!

కర్ణుడు:

చిత్తం. [మోడ్పుకేలితో యెదటికి వెళ్లి నమ్రుడై నుంచుంటాడు]

ద్రోణుడు:

కుమారా! నీబుద్ధికి అందనిది లేదు. ధానుష్కులలో

నీపేరు మొదటి బంతిలో వుంటుంది. నీకీర్తి మధ్యందిన మార్తాండుని దివ్యప్రభాజాలంతో చుట్టరికం చేస్తుంది. త్రికరణయా నీకు నా-శుభాశీస్సులు ఇస్తున్నాను. [బంతి యిస్తాడు]

కర్ణుడు:

[బంతి పుచ్చుకుని ద్రోణుడికి పాదాభివందనం చేసి] ధన్యుణ్ణి.

ద్రోణుడు:

ఇక మేము ముందుకి సాగుతాము. తమ రందరూ వెళ్లి మళ్లీ కందుకవినోదం—[అర్థోక్తి]

సుయోధనుడు:

బంతి తీసుకోలేనివాళ్ల కింకా వినోదం అంటే యేమిటి మహాత్మా?

ద్రోణుడు:

అదేమిటి ప్రభూ! నాకు మాట తక్కేయోగం వుండడంవల్ల తమ రందరూ అశ్రద్ధ చేశారు; గాని తమ సత్తాకిది అతీత మైనదా?

(దూరాన విదురుడితో భీష్ముడు)

సుయోధనుడు:

లోకగురూ! తమ వాక్కు అమోఘం కావాలని కోరుతున్నాను. మమ్మల్నందర్నీ తమ శిష్యకోటిలో చేర్చుకుని—[అర్థోక్తి]

దుశ్శాసనుడు:

సమయానికి తాతయ్యా!

సుయోధనుడు:

[అదరిపడి వెకక్కి తిరిగిచూసి] ఇంకేమి? మన అదృష్టం బయటపడినది. [ద్రోణుడితో] ఆచార్యోత్తమా! వారే మాతాతయ్యగారు, భీష్మాచార్యులవారిలా వేంచేస్తున్నారు. వారు తమర్ని కీర్తించని రోజు లేదు. తమరాక విన్నవించి వారి నిక్కడికి తోడుకుని వస్తాను సెల విప్పించండి.

ద్రోణుడు:

ఎంత మాట ప్రభూ! త్రిభువనవీరులూ, ఆదర్శపురుషులూ అయిన భీష్మాచార్యులవారు అయాచితంగా తటస్థపడగా వెళ్లి సేవించుకోక, నే నేమో మహామహా—అని మిటకరించుకుంటూ యిక్కడ కూచోనా? దయచెయ్యండి మేమున్నూ వస్తున్నాము. [పక్కకి తిరిగి] నాయనా! [అశ్వత్థామ చెయ్యి పట్టుకుని, వొక్కమాటు కృపి-కేసి చూసి ముందుకి అడుగు వేస్తాడు.]

సుయోధనుడు:

దయచెయ్యండి. [వెనక్కి తిరిగి చూసి] తాతయ్యగారు విజయంచేస్తున్నారు. వారూ, ఆచార్యులవారూ సమావేశం కాబోయే యీ ముహూర్తం గొప్ప పుణ్యకాలం. అందరూ రండి. [దుశ్శాసనుడితో] తమ్ముడూ! ముందర వెళ్లి తాతయ్యగారికి సంగతి నివేదించవోయ్!

దుశ్శాసనుడు:

చిత్తం అన్నయ్యా! [ముందు వెళ్లిపోతాడు?

(ముందు కర్ణసుయోధనులూ, వారి తరవాత సకుటుంబపరివారంగా ద్రోణుడూ, వారి వెనక తక్కిన అందరూ బయలుదేరతారు)

ద్రోణుడు:

(కృపితో జనాంతికం) ఆశ్రయం దొరికిందన్నమాటే.

కృపి:

(ద్రోణుడితో జనాంతికం) బతికాము. (అశ్వత్థామతో జనాంతికం) నాయనా! ఇక నీకు లోటుండదు.

అశ్వత్థామ:

[కృపితో జనాంతికం] యువరాజావా రెంత మంచివారండీ అమ్మా!

(అందరూ వెళ్లిపోతారు)